క్లుప్తంగా

బాలల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత

కడప కల్చరల్ : బాలల ఆరోగ్య రక్షణకు పెద్దలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని లజనతుల్ ఉలేమా కమిటీ కార్యదర్శి హజరత్ మౌలాన షేక్ మహమ్మద్ అలీ రషాది అన్నారు. స్థానిక బీడికాలనీలోని మక్కామసీదులో సంస్థ కోశాధికారి మౌలాన నూరుల్లా ఆధ్వర్యంలో ఉచిత వడుగుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ రషాది మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగానే ఈ ఏడాది కూడా సేవా దృష్టితో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వడుగులు చేయించుకున్న బాలురకు గోధుమపిండి, బ్రెడ్లు, పాలు, పండ్ల రసాలు, వినసకర్రలు, మందులు నిర్వాహకులు ఉచితంగా అందజేశారు. మసీదు ముతవల్లి సయ్యద్ అన్వర్‌బాషా, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్‌సెల్ నిర్వహించాలి

కడప సెవెన్‌రోడ్స్ : కలెక్టర్ కార్యాలయంలో గతంలో ఉన్న విధంగా ఎస్సీ ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్ సెల్ నిర్వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ వినోద్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం జేసీ గణేష్‌కుమార్‌కు వినతిపత్రమిచ్చారు. దీనిపై జేసీ మాట్లాడుతూ ఈ విషయాన్ని కలెక్టర్, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, నగర కార్పొరేటర్లు కె.బాబు, ఆర్.చెన్నయ్య, రత్నకుమారి, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి వైఎస్సార్‌జిల్లా జనరల్ సెక్రటరీ కృష్ణకుమార్, వైస్ చైర్మన్ పురుషోత్తం, ప్రభుత్వ డ్రైవర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండయ్య తెలిపారు. సోమవారం మూడవ దఫా ఉద్యమంలో భాగంగా జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తూ వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ నాయకులు లక్ష్మిరాజా, మహేష్, రమణారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాల్లో సమస్యలు పరిష్కరించండి

వైవీయూ : రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు కోరారు. సోమవారం వైవీయూ ప్రధాన ద్వారం వద్ద విశ్వవిద్యాలయాల్లోని సమస్యలపై కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కడప విభాగ్ కన్వీనర్ కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో బోధన, పరిశోధనకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. విశ్వవిద్యాలయాలకు వెంటనే పాలకమండళ్లను నిమించాలని కోరారు. ఖాళీగా ఉన్న అధ్యాపక, బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఏబీవీపీ నాయకులు భరత్, వెంకటేష్, సురేష్, శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

న్యాయశాస్త్ర విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని న్యాయశాస్త్ర విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కోరారు. సోమవారం వైవీయూలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వి. శివకుమార్ మాట్లాడుతూ న్యాయశాస్త్ర ఫలితాల్లో పాస్ పర్సెంటేజీ చాలా దారుణంగా ఉందన్నారు. అకడమిక్ క్యాలండర్ కూడా సరిగా లేదని, ఉత్తీర్ణతా శాతం 20 శాతం మించడం లేదని వారి దృష్టికి తీసుకువెళ్లారు. వైవీయూ క్యాంపస్‌లో న్యాయశాస్త్రశాఖను ప్రారంభించాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఇనాయతుల్లా, డేవిడ్‌రాజ్, న్యాయశాస్త్ర విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ఆర్డీఓకు వినతి

బద్వేలు అర్బన్ : బద్వేలు, గోపవరం మండలాల పరిధిలోని 33 సర్వేనెంబర్లలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సోమవారం ఆర్డీఓ ఆకులవెంకటరమణకు సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి చంద్రమోహన్‌రాజు, పట్టణ కార్యదర్శి బాలు మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న బద్వేలు పట్టణంలో కొంత మంది కబ్జారాయుళ్ళు విలువైన ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారని అన్నారు. తక్షణమే ఆర్డీఓ విచారణ జరిపి ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

10న పాలిసెట్

ప్రొద్దుటూరు : ఈ నెల 10న పాలిసెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీసీహెచ్ జగదీశ్వరుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరులోని 10 సెంటర్లలో 4,049 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన పేర్కొన్నారు.

దంత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

● ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి



దంత వైద్య విభాగాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలోని వైఎస్సార్ ఆర్టీసీ ఏరియా ఆస్పత్రిలో దంత విభాగాన్ని ప్రారంభించామని ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం కడప ఏరియా ఆస్పత్రిలో దంత వైద్యులు శ్రీధర్‌రెడ్డి తన సొంత నిధులతో డెంటల్ చైర్‌కు సంబంధించి అందించిన పరికరాలను చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ విజయవాడలోని విద్యాధరపురంలో ఆర్టీసీ తన సొంత నిధులతో డెంటల్ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇప్పుడు డెంటల్ సౌకర్యంతో కూడిన కడపలో ఏర్పాటు చేసిన ఆస్పత్రి రెండవదన్నారు. సేవా భావంతోడెంటల్ చైర్‌ను ఏర్పాటు చేసిన డాక్టర్ శ్రీధర్‌రెడ్డిని అభినందించారు. ఆర్టీసీ ఆస్పత్రిలో ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీధర్‌రెడ్డి తన సేవలను అందిస్తారన్నారు. కడపజోన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కడపజోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపినాథరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఆస్పత్రిలో దంత వైద్య సేవలు అందించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వింధ్య, రేష్మా, ప్రత్యూష, దివ్యతేజ, శ్రీమాధుర్యరెడ్డి, ఆర్టీసీ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మొత్తం 29 అర్జీలు వచ్చాయి. వీటిని సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ రత్నాల రాజు, డీసీపీ సంజీవ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, ఈఈ నారాయణ స్వామి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండలంలోని దేవరాజుపల్లె సచివాలయ పరిధిలోని చిన్నపుత్త, జీవంపేట, సముద్రంపల్లె గ్రామాలలో మంగళవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ చలపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



'బి అలర్ట్' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: వేసవి సెలవులలో మీ పిల్లలను బావులు, చెరువులు, నీటికుంటలు, డ్యామ్‌లు, నీటి ప్రవాహ ప్రాంతాలలో ఈతకు పంపించకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలనీ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలియజేశారు. సోమవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో కమలాపురంకు చెందిన అభి చారిటబుల్ ట్రస్ట్ వారు రూపొందించిన 'బి అలర్ట్' పోస్టర్‌ను జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు. కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, ఒంటిమిట్ట సీఐ ఆర్. పురుషోత్తంరాజు, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ రాజా ప్రభాకర్, అభి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాలసీదారుల సొమ్ము భద్రతే లక్ష్యం

ప్రొద్దుటూరు : ప్రపంచంలో ఆర్థిక సమీకరణ కలిగి ఉన్న పది సంస్థలలో మూడో స్థానంలో ఉన్న ఎల్‌ఐసీలో పొదుపు చేసుకున్న పాలసీదారుల సొమ్ముకు 13 లక్షల మంది ఏజెంట్లు కాపలాదారులుగా ఉన్నారని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన జోనల్ లియాఫి అధ్యక్షుడు జంపాల కృష్ణారెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన లియాఫీ ఆల్ ఇండియా జనరల్ కౌన్సిల్ సమావేశంలో హైదరాబాద్ జోన్ అధ్యక్షుడిగా జంపాల కృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తొలుత తనను బ్రాంచి అధ్యక్షుడిగా, తర్వాత డివిజన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని తెలిపారు. ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని దృష్టిలో ఉంచుకుని ఈ స్థాయికి ఎదిగానన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎల్‌ఐసీపై నియంతలా వ్యవహరించడం సరికాదన్నారు. సమావేశంలో కడప డివిజన్ లియాఫి అధ్యక్షుడు జయభారత్ రెడ్డి, కార్యదర్శి కదిరప్ప పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఒంటెద్దు బండలాగుడు పోటీలు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం ఒంటెద్దు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రొద్దుటూరుకు చెందిన గోర్ల సుబ్బరాయుడు ఎద్దు 2500 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచింది. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల బలరామిరెడ్డి, బీరం వెంకటరామిరెడ్డిలు ప్రారంభించారు. 22 ఎద్దులు పాల్గొన్నాయి. రెండో స్థానంలో ప్రొద్దుటూరు నాగేంద్ర ఎద్దు 2384, మూడో స్థానంలో ప్రొద్దుటూరు తుంగా నారాయణ ఎద్దు 2282, నాలుగో స్థానంలో నంద్యాల జిల్లా రుద్రవరం ధరణి ఎద్దు 2074, ఐదో స్థానంలో చాగలమర్రి మండలంలోని మల్లెవేముల నాగరాజు ఎద్దు 2072, ఆరో స్థానంలో మైదుకూరు మహానంది ఎద్దు 2054 అడుగులు లాగాయి.. ఆ ఎద్ల యజమానులకు రూ.10,000, రూ.7000 రూ.4000, రూ.2500, రూ.2000లు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి జయరామిరెడ్డి, జయచంద్రారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఒటెంద్దు బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి

రేపు భూముల వేలం పాట

రాజుపాళెం: టంగుటూరు గ్రామంలోని సోమేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి 28.5 ఎకరాల భూములకు ఈనెల 10న ఉదయం 10 గంటలకు వేలం పాట వేయనున్నట్లు ఆలయ చైర్మన్ గోనా వెంకటసుబ్బారెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాట ప్రొద్దుటూరులోని నారాయణ రంగయ్యగారి సత్రంలో నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. రూ.10వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలని సూచించారు.

కంటి వైద్య పరీక్షలు

చాపాడు : సీతారామాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద సోమవారం వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కంటి వైద్య శిబిరంలో 75 మంది పరీక్షలు నిర్వహించినట్టు కంటి వైద్యులు ఎంఎస్ తేజ తెలిపారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు జరిపిన వారిలో 14 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించామన్నారు.

అశ్వవాహనంపై చెన్నకేశవుడు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాములను అశ్వ వాహనంపై ఊరేగించారు. ముందుగా స్వాముల వారికి అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి స్వామి వారిని ఆశీనులు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, సర్పంచ్ కానాల రాధ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బలరామిరెడ్డి, దామోదర్‌రెడ్డి,ఇన్స్పెక్టర్ ఆర్ఆర్ నరసింహా సింగ్, ఈఓ నరసయ్య భక్తులు పాల్గొన్నారు.



పల్లకిలో ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

బదిలీలలో ప్రాధాన్యత కల్పించాలి

కడప ఎడ్యుకేషన్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులకు త్వరలో జరగబోయే బదిలీల్లో అదనపు పాయింట్లు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కడప జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి కోరారు. ఈ విషయమై సోమవారం స్టేట్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కమీషనర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డిని విజయవాడలోని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మెన్ కొండూరు శ్రీనివాసరాజు, కబ్ మాస్టర్ చంద్రశేఖర్, భూపతి, ఈశ్వరయ్య, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు పంటకు మద్దతు ధర కల్పించాలి

చింతకొమ్మదిన్నె : రాష్ట్ర ప్రభుత్వం పసుపు పంటకు మద్దతు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొలుములపల్లె రైతు భరోసా కేంద్రం వద్ద పసుపు పంటకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో పసుపు పంటను విస్తారంగా సాగు చేశారని, పంట చేతికొచ్చి ఇళ్లకు చేరుతున్న తరుణంలో కొనుగోలు చేసేది లేదని అధికారులు చెప్పడం సరికాదన్నారు. ఈ కారణంగా రైతులు వచ్చిన కాడికి వ్యాపారులకు పంటను అమ్ముకుంటున్నారని వాపోయారు. పసుపు పంటకు ఎకరాకు దాదాపు రూ. లక్ష వరకు ఖర్చు చేసినప్పటికీ పెట్టుబడులు సైతం రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు గోపాలకృష్ణయ్య, శ్రీనివాసులురెడ్డి, చక్రవర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు

చింతకొమ్మదిన్నె : ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు వచ్చాయని కొలుములపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలగంగిరెడ్డి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన సుష్మ 553, మైథిలి 542 మార్కులు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. పేద వర్గాలకు చెందిన విద్యార్థులు అధిక మార్కులు సాధించడం సంతోషదాయకంగా ఉందన్నారు.

కడపకు చేరుకున్న విద్యార్థులు



మణిపూర్ నుంచి కడపకు చేరుకున్న విద్యార్థులు

కడప అర్బన్: మణిపూర్ నుంచి తెలుగు రాష్ట్రాల విద్యార్థులు సురక్షితంగా ఇళ్లకు చేరుకుంటున్నారు. మణిపూర్‌లో ప్రస్తుతం హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. సుమారు 180 మంది ఆంధ్ర, తెలంగాణ విద్యార్థులు ఇంఫాల్‌లోనే చదువుకుంటుండగా... వీరిలో 108 మంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను అక్కడి ప్రభుత్వంతో సంప్రదించి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. అక్కడి నుంచి కడపకు గరుడ బస్సులో 23 మందిని పంపించారు. సోమవారం రాత్రి 11:20 గంటలకు బస్సు కడపకు చేరుకుంది. కడపకు వచ్చిన వారిలో కడప నగరం మృత్యుంజయకుంటకు చెందిన వెంకటరమణ కుమార్తె జాహ్నవి, తిరుపతికి చెందిన కార్తీక్, మదనపల్లెకు చెందిన శ్రీరామ్ చరణ్‌తేజ్, అర్చన ఉన్నారు.

సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు

మేం చదువుకుంటున్న ఇంఫాల్ నగరంలోని హాస్టల్‌లోనే ఉండిపోవాల్సి వస్తుందేమోననీ భయపడ్డాం. ఈనెల 3నుంచి అక్కడ జరుగుతున్న అల్లర్లు, హింసాత్మక సంఘటనల వల్ల మమ్మల్ని బయటకు వెళ్లనీయలేదు. ప్రభుత్వం తరపున అధికారుల చొరవ తీసుకుని కడపకు రావడం సంతోషించదగ్గవిషయం. – **జాహ్నవి, కడప**

ఐదు రోజులుగా నరకం అనుభవించాం

మా హాస్టల్ క్యాంపస్ చుట్టుప్రక్కల ప్రాంతంలోనే బాంబింగ్, హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయి. తిండికి, నీళ్లకు, ఇతర అవసరాలకు చాలా ఇబ్బందులు పడ్డాం. మళ్లీ మా ఊరు మదనపల్లెకు వస్తాననుకోలేదు. సురక్షితంగా చేరడం ఎంతో ఆనందంగా ఉంది. – **శ్రీరామ్ చరణ్ తేజ్**

చాలా భయపడ్డాం

మా తల్లిదండ్రులు, బంధువులు ఎంతో కంగారు పడ్డారు. క్యాంపస్‌లో బిక్కుబిక్కుమంటూ గడిపాం. ప్రభుత్వాలు చొరవ తీసుకుని మా ఇళ్లకు పంపించడం, మానాన్న ఆనందను చూడగానే ఎంతో సంతోషించాను. ఆర్టీసి వారు. ప్రభుత్వ అధికారులు చొరవ ఎప్పటికీ మరువలేనిది. – **అర్చన**

హెన్రీ ఆశయ సాధనకు కృషి చేద్దాం

● రెడ్‌క్రాస్ స్పెషల్ ఆఫీసర్ సాయిగ్రేస్



హెన్రీ డ్యూనాంట్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్పెషల్ ఆఫీసర్ సాయిగ్రేస్, సిబ్బంది

కడప కల్చరల్ : రెడ్‌క్రాస్ సంస్థ వ్యవస్థాపకులు హెన్రీ డ్యూనాంట్ ఆశయ సాధనకు అందరూ కృషి చేద్దామని సంస్థ స్పెషల్ ఆఫీసర్, స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ అన్నారు. సోమవారం స్థానిక మట్టిపెద్దపులివీధిలో గల రెడ్‌క్రాస్ సంస్థ కార్యాలయంలో జరిగిన రెడ్‌క్రాస్ దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు జాన్ హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సేవాతత్వానికి మారుపేరని, భవిష్యత్తులో ఈ కీర్తిని కాపాడుకునేందుకు అందరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ తేజ, జిల్లా కో ఆర్డినేటర్ సుధాకర్‌బాబు, సీనియర్ ల్యాబ్ టెక్నిషియన్ స్వరూపరాణి, ప్రశాంతి, సభ్యులు శివశంకర్, వసంత్, విష్ణు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత గ్రూపింగ్

రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిబ్బంది మరియాపురం వద్దగల ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థులకు ఉచితంగా బ్లడ్ గ్రూపింగ్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, హాస్టల్ ఇన్‌ఛార్జి మంజుల, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తా చాటిన 'సర్కారీ' విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో 'పది'లో ఉత్తమ ఫలితాలు



ధనుంజయ్ (565)



షేక్ అంజుమ్ (553)



షేక్ షీరీన్ బాను (535)



షేక్ తాహీద్ (525)

కమలాపురం : పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఉత్తమ మార్కులతోపాటు మెరుగైన ఉత్తీర్ణత శాతం సాధించి పలువురి మన్ననలు పొందారు. పట్టణంలో జ్యోతి బా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన టి.ధనుంజయ్ 565 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు. అదే పాఠశాలకు చెందిన గంగా వంశీ 552, టి.సంతోష్ 550 మార్కులు సాధించారు. చిన్నచెప్పలి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన బాలాజిరెడ్డి 561, అదే పాఠశాలకు చెందిన గంగా హైమావతి నవ్యశ్రీ 511 మార్కులు పొందారు. చిన్నరెడ్డిపల్లె ఉర్దూ హైస్కూల్‌కు చెందిన షేక్ అంజుమ్ 553, షేక్ షీరీన్ బాను 535, షేక్ తాహీద్ 525 సాధించారు. పెద్దచెప్పలి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జగదీశ్వర్‌రెడ్డి 558, షేక్ అర్షద్ 543 వశం చేసుకున్నారు. నల్లింగాయపల్లె హైస్కూల్ చెందిన పి.వి.చంద్రమోహన్‌రెడ్డి 557, ఎస్.లీలా మోహన్‌రెడ్డి 555, వై.జాహ్నవి 551, ఆర్.హేమ నందిని 535 కైవసం చేసుకున్నారు. కమలాపురం బాలికల హైస్కూల్‌కు చెందిన మిస్బా 554 , పూజిత 548, తస్నీమ్ 544 సాధించారు. గురుకుల పాఠశాలకు చెందిన వైభవ లక్ష్మీ 525, పీవీ నాగపావణి 507 పొందారు. కమలాపురం బాయ్స్ హైస్కూల్‌కు చెందిన హరి ఓబులేసు 512, ఎర్రగుడిపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన నిఖిత 529, లక్ష్మీ మమత 509 కైవసం చేసుకున్నారు. కమలాపురం ఉర్దూ హైస్కూల్‌కు చెందిన రోష్ని 495, నార్య 489, సానియా 488 మార్కులు వశం చేసుకున్నారు. వీరంతా నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులే.

సీఐ, ఎస్ఐలను సస్పెండ్ చేయాలి

– ధర్నాలో అఖిలపక్ష నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కడపలో తాము కార్యక్రమం నిర్వహిస్తుంటే అడ్డుకుని తప్పుడు కేసులు బనాయించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉలసయ్య, ఎస్ఐలు రామకృష్ణ, తాహిర్ హుసేన్‌లను తక్షణమే సస్పెండ్ చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఐ, సీపీఎం నాయకులను దూషించడమే కాకుండా కొట్టి అక్రమ కేసులు బనాయించడం అన్యాయమన్నారు. ఈ సంఘటనపై విచారణ జరిపి సంబంధిత పోలీసు అధికారులను శిక్షించాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు హరిప్రసాద్, లక్ష్మిరెడ్డి, అమీర్‌బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, నగర కార్యదర్శి వెంకట శివ, సీపీఎం నాయకుడు రామ్మోహన్‌రెడ్డి, ఆర్‌సీపీ నాయకుడు రవిశంకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తార్, వివిధ ప్రజా సంఘాల నాయకులు అవ్వారు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

– కేఎస్ఆర్ఎం ప్రధానాచార్యులు కేఎస్ఎస్ మూర్తి



ఎన్ఎస్ఎస్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ప్రజాసేవే లక్ష్యంగా యువత ముందుండి పోరాడాలని.. ప్రజల అవసరాలు, సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కృషి చేయాలని కేఎస్ఆర్ఎం కళాశాల ప్రధానాచార్యులు వీఎస్ఎస్‌మూర్తి అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు ఏడు రోజులపాటు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మొదటిరోజు సోమవారం కొప్పర్తి గ్రామంలో క్యాంపును ప్రారంభించారు. క్యాంపులో భాగంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామంలో ప్రజలను కలిసి వారికి విద్య, వైద్యం, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. బడి ఈడు పిల్లలను చేర్పించే విషయమై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు వీఎస్ఎస్ మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సురేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీలుగలు, పిల్లిపెసర విత్తనాలు మంజూరు

వీరపునాయునిపల్లె : మండలానికి 10 క్వింటాలు జీలుగలు, 5 క్వింటాలు పిల్లి పెసర విత్తనాలు మంజూరయినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన అనిమెల రైతుల భరోసా కేంద్ర పరిధిలో పచ్చిరొట్ట ఎరువుల విత్తన నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 శాతం రాయితీతో జీలుగలు, పిల్లి పెసర విత్తనాలను అందజేయడం జరుగుతోందన్నారు. జీలుగలు కిలో 79 రూపాయలు కాగా రైతు వాటా 39.50, పిల్లి పెసర 97 కాగా రైతు వాటా 48.50 చెల్లించాలని సూచించారు. విత్తనం అవసరమున్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబరు తీసుకొని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి నమోదు చేయించుకోవాలని తెలిపారు. వరి సాగు చేయు రైతులకు ఎకరాకు జీలుగలు 10 కిలోలు, పిల్లి పెసర 8 కిలోలు అందజేయడం జరుగుతుందని తెలియజేశారు.రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గర్భిణుల నమోదు పూర్తి చేయాలి

వీరపునాయునిపల్లె : మండలంలోని అన్ని గ్రామాల్లో గర్భిణుల నమోదు వంద శాతం పూర్తి చేయాలని మండల ఆరోగ్య నోడల్ అధికారి రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, సచివాలయ హెల్త్ సెక్రటరీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వీరపునాయునిపల్లె మండలం 86 శాతంతో బి గ్రేడులో ఉందని, ఏ గ్రేడులో ఉంచేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో మండల వైద్యాధికారి వెంకటగిరి, సూపర్‌వైజర్ పద్మావతమ్మ, పాయసంపల్లె, వీరపునాయునిపల్లె సెక్టార్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు జయలక్ష్మి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో సంభవించిన అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులకు సత్వరమే నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మోర్చా రాష్ట్ర అధ్యక్షులు వంగల శశిభూషణ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఉట్టి శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షులు యల్లారెడ్డిలు మాట్లాడుతూ ఫిబ్రవరి నుంచి అప్పుడప్పుడు జిల్లాలో అకాల వర్షాలు కురుస్తున్నాయన్నారు. దీంతో వేలాది మంది రైతులు నష్టపోయారన్నారు. అధికారులు పంటనష్ట వివరాలు సేకరించడంలో అనేక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు పరిహారం ఇప్పిస్తూ, సాగు చేయబోయే పంటలకు విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆహార పంటలకు ఎకరాకు రూ. 30 వేలు, ఉద్యాన, వాణిజ్య పంటలకు రూ. 50వేలు చొప్పున రైతుల ఖాతాల్లోజమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బీపీ ప్రతాప్‌రెడ్డి, సింగారెడి రామచంద్రారెడ్డి, మాదినేని వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.